## 13 అసెంబ్లీ స్థానాలకు నేడు బైపోల్స్

- ఏడు రాష్ట్రాల్లో ఉప ఎన్నికల సమరం
- అత్యధికంగా బెంగాల్‌లో 4 సీట్లకు పోలింగ్

న్యూఢిల్లీ, జూలై 9: సార్వత్రిక ఎన్నికల తర్వాత దేశంలోని పలు అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఏడు రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ నియోజకవర్గాలకు బుధవారం ఉప ఎన్నికల పోలింగ్ జరుగనున్నది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల తర్వాత తొలిసారిగా జరుగుతున్న ఎన్నికలు ఇవే. పశ్చిమ బెంగాల్‌లోని రాయ్‌గంజ్, రాణాఘాట్ దక్షిణ్, బాగాధ్, మనిక్‌టాలా, ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్, మాంగ్లౌర్, పంజాబ్‌లోని జలంధర్ వెస్ట్, హిమాచల్‌లోని డెహ్రా, హమీర్‌పూర్, నాలాగఢ్, బీహార్‌లోని రూపాలి, తమిళనాడులోని విక్రవండి, మధ్యప్రదేశ్‌లోని అమర్వార్ స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహిస్తున్నారు. వివిధ పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు కొంతమంది రాజీనామా చేయటం, మరికొంత మంది మరణించటంతో ఆయా స్థానాలు ఖాళీ అయ్యాయి. ఉప ఎన్నికల ఫలితాలు ఈ నెల 13న వెలువడతాయి. హిమాచల్‌ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖు భార్య కమ్లేష్ ఠాకూర్‌తో పాటు మరికొంత మంది తొలిసారిగా ఎన్నికల బరిలోకి దిగుతున్నారు.

## డెత్‌వ్యాలీకి పోటెత్తుతున్న పర్యాటకులు




డెత్‌వ్యాలీ: డెత్ వ్యాలీ.. ప్రపంచంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతం. అమెరికాలోని కాలిఫోర్నియాలోని ఉన్నది. ఇక్కడ 50 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. మలమల మాడ్చే ఈ ఎండ ఎలా ఉంటుందో చూసేందుకు ఇక్కడికి పర్యాటకులు పోటెత్తుతున్నారు. ఎండ వేడిమికి ఇటీవల ఓ బైక్ రైడర్ ప్రాణాలు కోల్పోయాడు. మరొకరు దవాఖాన పాలయ్యారు. అయినప్పటికీ పర్యాటకులు వెనక్కి తగ్గడం లేదు. డెత్ వ్యాలీ నేషనల్ పార్క్ యాజమాన్యం వద్దని వారిస్తున్నా పర్యాటకుల రాక మాత్రం ఆగడం లేదు. గత శని, ఆదివారాల్లో ఇక్కడ 53.3 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. 1913 జూలైలో ఇక్కడ అత్యధికంగా 56.67 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

## 2 నెలల్లో అమరులైన ఇద్దరు బిడ్డలు

- దేశం కోసం ప్రాణాలర్పించిన ఆదర్శ్ నేగి, ప్రణయ్ నేగి
- ఉత్తరాఖండ్ కుటుంబంలో తీరని విషాదం



ఆదర్శ్ నేగి

డెహ్రాడూన్, జూలై 9: కేవలం రెండు నెలల వ్యవధిలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు జవాన్లు దేశ రక్షణలో అమరులయ్యారు. జమ్ముకశ్మీర్‌లోని కథువా జిల్లాలో సోమవారం ఆర్మీ కాన్వాయ్‌పై జరిగిన ఉగ్రవాడిలో మరణించిన ఉత్తరాఖండ్‌కు చెందిన సైనికుడు ఆదర్శ్ నేగి కుటుంబానికి ఎదురైన విషాదకర పరిస్థితి ఇది. విధి నిర్వహణలో తమ బిడ్డలు దేశం కోసం ప్రాణాలు అర్పించారని గర్వంగా ఉన్నప్పటికీ, మరోవైపు కడుపు కోత తల్లిదండ్రుల కండ్ల నుంచి దుఃఖాన్ని ఆపనీయడం లేదు. రెండు నెలల్లో ఇద్దరిని కోల్పోవడంతో ఆ కుటుంబసభ్యులు తల్లడిల్లుతున్నారు. ఉత్తరాఖండ్‌లోని తేహ్రి జిల్లాకు చెందిన 26 ఏండ్ల జవాన్ ఆదర్శ్ నేగి.. సోమవారం జరిగిన ఉగ్రదాడిలో మరణించారు. అంతకుముందు ఈ ఏడాది ఏప్రిల్ 30న లేహ్‌లో ఆదర్శ్ నేగి పెద్దనాన్న కుమారుడు 33 ఏండ్ల మేజర్ ప్రణయ్ నేగి మరణించారు. ఆదర్శ్ నేగి పెద్దనాన్న బల్వంత్ సింగ్ మాట్లాడుతూ రెండు నెలల వ్యవధిలోనే ఇద్దరు కుమారులను పోగొట్టుకొన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదర్శ్ నేగి 2018లో గర్వాల్ రైఫిల్స్‌లో చేరారు. ఆదర్శ్ నేగి తండ్రి ఓ రైతు. తల్లి, ఓ సోదరుడు, సోదరి ఉన్నారు. ఆర్మీలో ఉద్యోగం సాధించిన అతను.. దేశం కోసం ప్రాణాలు అర్పించాడని బల్వంత్ సింగ్ గర్వంగా చెప్పాడు. దేశానికి సేవ చేయాలని వెళ్లిన తమ బిడ్డలు.. మృతదేహాలుగా ఇంటికి వచ్చారని, ఇది కుటుంబాన్ని దుఃఖ సాగరంలో ముంచిందని అన్నారు.

# చైనా సైబర్ నేరగాళ్ల చెరలో భారతీయులు

### 3 వేల మంది ఉన్నట్టు అనుమానం.. మెజారిటీ బాధితులు తెలుగువాళ్లే

- జాబ్ ఇప్పిస్తామని నమ్మించి డబ్బులు గుంజుకొని మోసం
- కంబోడియాలో హౌస్ అరెస్ట్
- న్యూడ్ వీడియోలు చూపించి యువతులకు బెదిరింపులు
- తప్పించుకొన్న తెలంగాణవాసి
- 'టైమ్స్' ఇంటర్వ్యూలో షాకింగ్ విషయాలు



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 9 (నమస్తే తెలంగాణ): విదేశాల్లో ఉద్యోగాన్వేషణలో ఉన్న యువతీ, యువకులే వారి టార్గెట్. తొలుత జాబ్ ఆఫర్ ఉందంటారు. 'మంచి కంపెనీలో, ఆకర్షణీయ వేతనంతో మీ కోసం కొలువు వేచి చూస్తున్నద'ని ఊరిస్తారు. ఇది చూసి మాయలో పడ్డామో.. ఇక, అంతే. మన దగ్గర ఉన్న డబ్బంతా ఊడ్చేసి.. పాస్‌పోర్ట్‌ను లాగేసుకొని.. ఓ కట్టు బానిసలా.. ఇరుకిరుకు చీకటి గదుల్లో చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు, సైబర్ నేరాలకు ఓ పావుగా వాడుకొంటారు. ఎదురుతిరిగామో.. యువకులనైతే అన్నంపెట్టకుండా చితకబాదుతారు. అమ్మాయిలైతే, న్యూడ్ వీడియోలను సోషల్‌మీడియాలో వైరల్ చేస్తామని బెదిరిస్తారు. దేశం కాని దేశం. ఏంచెయ్యాలో కూడా తెలియని దుస్థితి. అలా జీవితం క్రమంగా అంధకారంలోకి దిగజారిపోతుంది. ఇదేదో.. సినిమా స్టోరీ కాదు. భారత్‌కు చెందిన దాదాపు మూడు వేల మందిని ఇలాగే చైనాకు చెందిన కొందరు సైబర్ నేరగాళ్లు చెరబట్టారు. కంబోడియాకు రహస్యమార్గంలో అక్రమంగా తరలించి ఇరుకిరుకు గదుల్లో బంధించారు. ఆ బందీఖానా నుంచి ఎలాగోలా తప్పించుకొన్న మహబూబాబాద్ బయ్యారం మండలానికి చెందిన మున్షీ ప్రకాశ్ తన అనుభవాన్ని జాతీయ పత్రిక 'టైమ్స్ ఆఫ్ ఇండియా'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో వివరించాడు. ఆ భయానక అనుభవాలు అతడి మాటల్లోనే..

**ట్రావెల్ హిస్టరీ ఉండాలంటే..**

బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేశా. హైదరాబాద్‌లోని ఓ ఐటీ కంపెనీలో ఉద్యోగం చేసేవాడిని. అయితే, విదేశాల్లో ఉన్నతోద్యోగం చేయడం నా కల. దీంతో జాబ్ సైట్లలో నా ప్రొఫైల్‌ను అప్‌లోడ్ చేశా. కొద్దిరోజుల తర్వాత విజయ్ అనే ఏజెంట్ నాకు ఫోన్ చేశాడు. అతనిది కంబోడియాగా చెప్పాడు. ఆస్ట్రేలియాలో ఓ మంచి కంపెనీలో, ఆకర్షణీయ వేతనంతో ఉద్యోగావకాశం ఉంది అని ఊరించాడు. ఇంతకు ముందు విదేశాలకు వెళ్లావా? అని నన్ను అడిగాడు. లేదన్నా. దీంతో ఆయన మాట్లాడుతూ.. ఆస్ట్రేలియాకు రావాలంటే అంతకుముందే ఏదైనా దేశానికి ప్రయాణం చేసినట్టు ట్రావెల్ హిస్టరీ ఉండాలన్నాడు. మలేషియాకు ఫ్లైట్ టికెట్స్ బుక్ చేసినట్టు చెప్పాడు. దీంతో ఎంతో సంబురంగా విమానం ఎక్కాను.

**అక్కడి నుంచి వేధింపులు మొదలు..**

కౌలాలంపూర్ విమానాశ్రయంలో దిగగానే అక్కడి నుంచి కొందరు వ్యక్తులు నన్ను కంబోడియా రాజధాని ఫెనోమ్ ఫెన్‌కు మార్చి 12న తీసుకెళ్లారు. ఏజెంట్ విజయ్ పంపించాడని తనకు తాను పరిచయం చేసుకొన్న ఓ వ్యక్తి నా దగ్గరున్న కొన్ని అమెరికన్ డాలర్లను (విలువ రూ. 85 వేలు) తీసుకొన్నాడు. అతనితో వచ్చిన మరికొందరు చైనీయులు నా దగ్గరున్న పాస్‌పోర్ట్‌ను తీసుకొని కంబోడియాలోనే మరో పట్టణం క్రోంగ్ బావెట్‌కు తీసుకెళ్లారు. పెద్ద భవంతులతో కూడిన మైదానం అది. అందులో ఓ భవంతి (టవర్ సీ)లోకి నన్ను తీసుకెళ్లారు. యువతీ, యువకులతో కలిపి అక్కడ దాదాపు 3 వేల మంది భారతీయులు ఉన్నారు. అందులో తెలుగువాళ్లే ఎక్కువ. వెళ్లినప్పటి నుంచి దాదాపు పది రోజులపాటు అమ్మాయిల ప్రొఫైల్ ఫొటోలు, పేర్లతో నకిలీ సోషల్‌మీడియా ఖాతాలు ఎలా క్రియేట్ చెయ్యాలి? సైబర్ దాడులు, హనీ ట్రాపింగ్ ఎలా చేయాలి? అన్న విషయాలను నేర్పించారు. స్నానం చేసేప్పుడు అమ్మాయిల న్యూడ్ వీడియోలు తీసేవారు. తప్పుడు పనులు చేయబోమని ఎదురుతిరిగితే యువకులకు ఆహారం పెట్టకుండా చితకబాదడం చేసేవారు. ఎదురుతిరిగిన అమ్మాయిలను తమ న్యూడ్ వీడియోలను సోషల్‌మీడియాలో వైరల్ చేస్తామని బెదిరించేవారు. హనీట్రాపింగ్‌లో భాగంగా న్యూడ్ వీడియో కాల్స్ చేయాలంటూ కొందరు యువతులను బలవంతపెట్టేవారు.

**అలా బయటపడ్డా..**

ముఖ్యంగా తెలుగులో అమ్మాయిల ఫేక్ ఫొటోలతో అకౌంట్లు క్రియేట్ చేయమని నన్ను బలవంతపెట్టేవారు. వ్యతిరేకించిన నన్ను ఓ చీకటి గదిలో వారంపాటు ఉంచి వేధించారు. అస్వస్థతకు గురయ్యా. దీంతో చీకటి రూమ్ నుంచి నన్ను వేరే గదికి మార్చారు. జబ్బుతో ఉన్నప్పటికీ పనిచేయాలని బలవంతపెట్టారు. ఎలాగోలా ఓ మొబైల్ సంపాదించి సెల్ఫీవీడియోలో నా బాధనంతా రికార్డు చేశా. తమిళనాడులోని మా సోదరికి మెయిల్ చేశా. ఆమె అధికారులను సంప్రదించింది. అయితే, ఏప్రిల్ 16న కంబోడియా పోలీసులు ఓ ఆపరేషన్‌లో భాగంగా నన్ను రక్షించారు. అయితే సరైన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో అరెస్ట్ చేశారు. 12 రోజులు జైలు జీవితం అనుభవించిన తర్వాత ఇండియన్ ఎంబసీ సహకారంతో విడుదలయ్యా. జూలై 5న భారత్‌కు తిరిగొచ్చా. అయితే, కంబోడియాలోని చైనా సైబర్ నేరగాళ్ల డెన్‌లో 3 వేల మంది భారతీయులు ఇంకా బందీలుగానే ఉన్నారు. అందులో మన తెలుగు రాష్ట్రాలవారే ఎక్కువ. ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు వారిని రక్షించే చర్యలు చేపట్టాలని ప్రకాశ్ ఈ సందర్భంగా అభ్యర్థించాడు.

## 22 ఏండ్లుగా చెక్కుచెదరని మృతదేహం

న్యూయార్క్: ఓ పర్వతారోహకుడు పెరూలోని హౌస్కరాన్ పర్వతాన్ని అధిరోహిస్తూ 22 ఏండ్ల కిందట తప్పిపోయాడు. మంచు కూలి దాని కిందే మరణించినట్లు భావించారు. రెస్క్యూ ఆపరేషన్ చేపట్టినా ఫలితం లేకపోయింది. అయితే, వాతావరణ మార్పుల వల్ల ఆ మంచు అంతా కరిగి మృతదేహం పైకి తేలింది. అలా.. 22 ఏండ్ల పాటు ఆ మృతదేహం మంచులోనే భద్రంగా ఉన్నది. అతడి వస్తువులు కూడా చెక్కుచెదరకుండానే ఉన్నాయి. పెరువియన్ పోలీసులు.. ఆ మృతదేహం అమెరికాకు చెందిన విలియం స్టాంప్‌ఫిల్ అనే పర్వతారోహకుడిది అని వెల్లడించారు.

## 'జనాభా నియంత్రణ పాలసీ అవసరం'

న్యూఢిల్లీ: దేశంలో ముస్లిం జనాభా పెరుగుదలపై ఆరెస్సెస్ మ్యాగజైన్ ఆర్గనైజర్ ఆందోళన వ్యక్తం చేసింది. సమగ్ర జాతీయ జనాభా నియంత్రణ పాలసీని తీసుకురావాల్సిన అవసరం ఉన్నదని నొక్కిచెప్పింది. పలు ప్రాంతాల్లో ముస్లింల జనాభా గణనీయంగా పెరుగుతున్నదని, దీంతో జనాభా అసమతుల్యత ఏర్పడుతున్నదని పేర్కొన్నది. సరిహద్దుల్లో అక్రమ వలసల వల్ల కూడా జనాభా పెరుగుదల నమోదవుతున్నదని తెలిపింది.

## నాకు ఓటేయకపోతే మీ కోసం పనిచేయను

**బీజేపీ ఎమ్మెల్యే హెచ్చరిక**

బిజ్నూర్: ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయిన యూపీలోని నాథూర్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే ఓమ్ కుమార్ ఓటర్లపై విరుచుకుపడ్డారు. 'నాకు ఈసారి ఓటేయని ప్రజలను మరోసారి ఓటేయమని అడగడం, వారి పట్ల వివక్ష లేకుండా పని చేస్తానని చెప్పే రోజులు పోయాయి. ఇప్పుడు మీరు నాకు ఓటేయకపోతే నేను మీ కోసం పని చేయను' అని ఓ కార్యక్రమంలో ఆయన అన్న మాటలు వైరల్‌గా మారాయి. ఈ సందర్భంగా కుమార్ అధికారులను కూడా హెచ్చరించారు. 'నా కార్యకర్తలను గౌరవించని అధికారులు జిల్లాలో ఉండటానికి అనుమతించను' అని ఆయన అన్నారు.

## రామసేతు పూర్తి మ్యాపింగ్

### 99.8శాతం వంతెన నీళ్లలో మునిగింది: ఇస్రో సైంటిస్టులు

న్యూఢిల్లీ, జూలై 9: 'రామసేతు' వంతెనకు సంబంధించి పూర్తి మ్యాప్‌ను 'ఇస్రో' సైంటిస్టులు ఆవిష్కరించారు. రామేశ్వరం నుంచి శ్రీలంకలోని మన్నార్ దీవిని కలుపుతూ సముద్రంలో ఉన్న వంతెన నిర్మాణ తీరుపై పరిశోధకులు కొత్త విషయాలు కనుగొన్నారు. వంతెనలోని 99.8శాతం సముద్రపు నీళ్లలో మునిగిపోయి ఉందని పరిశోధనలో తేలింది. నాసాకు చెందిన 'ఐసీఈశాట్–2' శాటిలైట్ డాటాను ఉపయోగించి, జోధ్‌పూర్, హైదరాబాద్ నేషనల్ రిమోట్ సెన్సింగ్ కేంద్రాలకు చెందిన సైంటిస్టులు 'రామసేతు' మ్యాపింగ్ ప్రక్రియను చేపట్టారు. వంతెన నిర్మాణం ఏ కాలం నాటిదన్నది తెలుసుకునేందుకు ఈ పరిశోధన దోహదపడుతుందని సైంటిస్టులు భావిస్తున్నారు.

## హాథ్రస్ ఘటనలో కుట్ర కోణాన్ని కొట్టిపారేయలేం

- సత్సంగ్ తొక్కిసలాటకు నిర్వాహకులే బాధ్యులు
- యూపీ ప్రభుత్వానికి సిట్ నివేదిక

లక్నో, జూలై 9: హాథ్రస్‌లో తొక్కిసలాట ఘటనపై సిట్ మంగళవారం తన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. హాథ్రస్ ఘటనలో నిర్వహణాపరమైన లోపాలు ఉన్నాయని పేర్కొన్న నివేదిక.. ఇదే సమయంలో ఘటన వెనుక 'భారీ కుట్ర' కోణాన్ని కూడా కొట్టిపారేయలేమని పేర్కొన్నది. ఈ విషాద ఘటనకు నిర్వాహకులే బాధ్యులని పేర్కొన్నది. భోలే బాబా పేరును ఎక్కడా ప్రస్తావించకుండా ఓ విధంగా ఆయనకు సిట్ క్లీన్‌చిట్ ఇచ్చింది. కాగా, భోలే బాబాకు సంబంధించి విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. రాజస్థాన్‌లోని ఆశ్రమంలో భోలే బాబా ఉన్న సమయంలో మహిళా భక్తులను మాత్రమే ఆశ్రమంలోకి అనుమతించేవారని గ్రామస్తులు చెబుతున్నారు.

## వాణిజ్య

### ఎల్‌అండ్‌టీ చేతికి సిలికంచ్

న్యూఢిల్లీ, జూలై 9: బెంగళూరుకు చెందిన సిలికంచ్ సిస్టమ్స్‌ను లార్సెన్ అండ్ టూబ్రో (ఎల్‌అండ్‌టీ) అనుబంధ సంస్థ ఎల్‌అండ్‌టీ సెమీకండక్టర్ టెక్నాలజీస్ లిమిటెడ్ రూ.183 కోట్లకు కొనుగోలు చేస్తున్నది. ఈ మేరకు షేర్ల కొనుగోలు ఒప్పందంపై సోమవారమే సంతకాలు జరిగినట్టు మంగళవారం ఎల్‌అండ్‌టీ బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు తెలియజేసింది. అలాగే ఈ డీల్‌తో సెమీకండక్టర్ వ్యాపారంలో మరింతగా బలోపేతం కాగలమన్న విశ్వాసాన్ని ఎల్‌అండ్‌టీ వ్యక్తం చేసింది. ఈ ఏడాది సెప్టెంబర్‌కల్లా లావాదేవీ పూర్తికావచ్చన్నది. కాగా, 2016 ఏప్రిల్‌లో సిలికంచ్ ఏర్పాటైంది. ఇదో ఫ్యాబ్‌లెస్ సెమీకండక్టర్ డిజైన్ కంపెనీ. సెమీకండక్టర్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ (ఐపీ), ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్ (ఐసీ) డిజైన్, అభివృద్ధి దీని ప్రత్యేకత. ప్రపంచవ్యాప్తంగా దీనికి 30 గ్రాంటెడ్ పేటెంట్లున్నాయి.

### సోలార్ వైపు ఎంఎస్ఎంఈలు

హైదరాబాద్, జూలై 9 (నమస్తే తెలంగాణ): విద్యుత్ కష్టాల నుంచి బయట పడటంతోపాటు బిల్లుల భారాన్ని తగ్గించుకునేందుకు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా(ఎంఎస్ఎంఈ) పరిశ్రమలు సోలార్ విద్యుత్ వైపు అడుగులు వేస్తున్నాయి. పర్యావరణ హితంగా కూడా ఉండటంతోపాటు కేంద్ర ప్రభుత్వం భారీగా రాయితీలు ఇస్తుండటంతో చాలా సంస్థలు వీటిని ఏర్పాటు చేసుకుంటున్నాయి. సోలార్‌ను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా చర్యలు తీసుకుంటుండటం కూడా కలిసిరానున్నది. దేశీయంగా వినియోగిస్తున్న మొత్తం విద్యుత్‌లో 50 శాతానికి పైగా వాటాను ఎంఎస్ఎంఈలు సహా పరిశ్రమలు కలిగివున్నాయి. ప్రస్తుతం దేశంలో 6.3 కోట్లకుపైగా ఎంఎస్ఎంఈలు ఉండగా, తెలంగాణలో 60 వేలకు పైగా సంస్థలు ఉన్నట్లు అంచనా. కేంద్ర ప్రభుత్వం 2030 నాటికి 40గిగా వాట్ల సోలార్ విద్యుత్‌ను చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందులో భాగంగా భారీగా సబ్సిడీలు అందిస్తుండటంతో గృహ వినియోగదారులతోపాటు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల వారు కూడా సోలార్ విద్యుత్ ఏర్పాటునకు మొగ్గుచూపుతున్నారు.

## హారియర్, సఫారీ ధరలు తగ్గించిన టాటా

### రూ.1.40 లక్షల వరకు ప్రయోజనాలు కల్పించిన సంస్థ

ముంబై, జూలై 9: దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన టాటా మోటర్స్ మరో మైలురాయిని సాధించింది. దేశీయ రోడ్లపై 20 లక్షల యూనిట్ల ఎస్‌యూవీ వాహనాలను విక్రయించింది. ఈ సందర్భంగా కొత్తగా ఎస్‌యూవీలను కొనుగోలు చేసేవారికి ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు ప్రకటించింది. 'కింగ్స్ ఆఫ్ ఎస్‌యూవీ' పేరుతో ప్రకటించిన ఈ ఆఫర్ కింద సఫారీ, హారియర్, నెక్సాన్, పంచ్ వాహనాలపై రూ.1.40 లక్షల వరకు ఆర్థిక ప్రయోజనాలు పొందవచ్చునని కంపెనీ సూచించింది. దీంట్లోభాగంగా హారియర్ ప్రారంభ ధరను రూ.14.99 లక్షలకు దించిన సంస్థ..సఫారీ ధరను కూడా రూ.15.49 లక్షలకు తగ్గించింది. దీంతోపాటు ఎలక్ట్రిక్ వాహనమైన నెక్సాన్‌పై రూ.1.3 లక్షల వరకు తగ్గించింది. ఈ ఆఫర్లు ఈ నెల 31 వరకు అందుబాటులో ఉండనున్నాయి.

**మారుతి వ్యారెంటీ పెంపు**

మారుతి సుజుకీ కస్టమర్ల బాటపట్టింది. ఇప్పటికే కార్లను కొనుగోలు చేసిన వారికి రెండేండ్లు లేదా 40 వేల కిలోమీటర్ల వ్యారెంటీ గడువును మూడేండ్లు లేదా లక్ష కిలోమీటర్ల వరకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. కొత్త కారును కొనుగోలు చేసిన వారు మూడేండ్ల వరకు ఎలాంటి భారం వేయకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ వ్యారెంటీ గడువును పెంచినట్లు, దీనిని కూడా ఆరేండ్ల వరకు పెంచుకునే అవకాశం కూడా ఉంటుందని ఎంఎస్ఐఎల్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి పార్థో బెనర్జీ తెలిపారు. ఇందుకోసం పలు ప్యాకేజీలను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. వీటిలో ప్లాటినం ప్యాకేజీ కింద వ్యారెంటీని నాలుగేండ్లు లేదా 1.20 లక్షల కిలోమీటర్లు, రాయల్ ప్లాటినం ప్యాకేజీ కింద ఐదేండ్లు లేదా 1.40 లక్షల కిలోమీటర్లు, సాలిటైర్ ప్యాకేజీ కింద ఆరేండ్లు లేదా 1.60 లక్షల కిలోమీటర్ల ప్యాకేజీల్లో ఏదైనా ఎంచుకునే అవకాశం కస్టమర్‌కు ఉంటుందన్నారు.

## సింగిల్ చార్జ్‌తో 800 కి.మీ.

### షియామీ తొలి ఈవీ ఎస్‌యూ7 ఆకర్షణీయం

### సంస్థ 10వ వార్షికోత్సవం సందర్భంగా ప్రదర్శన



బెంగళూరు, జూలై 9: ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీ కంపెనీ, చైనాకు చెందిన షియామీ.. తొలిసారిగా రూపొందించిన విద్యుత్తు ఆధారిత వాహనం (ఈవీ) ఆకట్టుకుంటున్నది. స్పీడ్ అల్ట్రా (ఎస్‌యూ)7 పేరుతో తెచ్చిన ఈ కారును.. భారతీయ మార్కెట్‌లో తమ 10వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఇక్కడ షియామీ ప్రదర్శించింది. దేశీయ విపణిలోకి ఇంకా రాని ఈ కారు ప్రారంభ ధర 30 వేల డాలర్లలోపే (రూ.25 లక్షలు). ఇది చైనాలో టెస్లా మాడల్ 3 ప్రారంభ ధర కన్నా 4 వేల డాలర్లు తక్కువే కావడం గమనార్హం. చైనాలో ఈ ఏడాది మార్చి నుంచి ఎస్‌యూ7 అమ్మకాలు మొదలవగా.. కొనుగోలుదారుల నుంచి విశేష స్పందన లభిస్తున్నది. ఈ–మోటర్, సీటీబీ ఇంటిగ్రేటెడ్ బ్యాటరీ, షియామీ డై-క్యాస్టింగ్, షియామీ పైలట్ అటానమస్ డ్రైవింగ్, స్మార్ట్ క్యాబిన్ అనే ఐదు కీలక ఈవీ టెక్నాలజీలను ఈ కారులో వాడారు.

**మొబైల్ గిరాకీ లేకనే..**

మార్కెట్‌లో స్మార్ట్‌ఫోన్లకు డిమాండ్ పడిపోతున్న నేపథ్యంలోనే షియామీ.. ఆటోమొబైల్ రంగం వైపు అడుగులు వేసిందని అంటున్నారు. నిజానికి 2021లోనే ఈవీల తయారీ దిశగా సంస్థ వెళ్లింది. దశాబ్దకాలంలో 10 బిలియన్ డాలర్ల పెట్టుబడులే లక్ష్యంగా ముందుకు కదిలింది. ఈ క్రమంలోనే గత ఏడాది డిసెంబర్‌లో 'సూపర్ ఎలక్ట్రిక్ మోటర్' టెక్నాలజీతో ఎస్‌యూ7 పరిచయమైంది. టెస్లా, పోర్షే ఎలక్ట్రిక్ వాహనాల కన్నా మించిన వేగంతో ఈ కారు దూసుకుపోగలదని షియామీ చెప్తున్నది. కాగా, బీజింగ్‌లోని ఓ ఫ్యాక్టరీలో ప్రభుత్వ రంగ సంస్థ బీఏఐసీ గ్రూప్ అనుబంధ కంపెనీయే షియామీ కార్లను తయారు చేయబోతున్నట్టు చెప్తున్నారు. వార్షిక సామర్థ్యం 2 లక్షల కార్లు. ఇదిలావుంటే మే నెలతో పోల్చితే గత నెల జూన్‌లో దేశీయంగా ఈవీల అమ్మకాలు 14 శాతం పడిపోయాయి. ప్రభుత్వ విధానాల్లో మార్పులు, హైబ్రిడ్ వాహనాలపై పెరుగుతున్న ఆసక్తి కారణమంటున్నారు.

**ఎస్‌యూ7 విశేషాలు**

- సింగిల్ చార్జ్‌తో 668 కిలోమీటర్లు, 800 కిలోమీటర్లు ప్రయాణించేలా రెండు రకాల కార్లు అందుబాటులో
- కేవలం 2.78 సెకండ్లలోనే గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలదు. ఇంత వేగంలోనూ 33.3 మీటర్ల దూరం వెళ్లేలోపే పూర్తిగా ఆగగలదు.
- కారు గరిష్ఠ వేగం గంటకు 265 కిలోమీటర్లు.
- కారులో మొత్తం 16 యాక్టివ్ సేఫ్టీ ఫీచర్లు.
- 16.1 అంగుళాల 3కే అల్ట్రా–క్లియర్ సెంట్రల్ కంట్రోల్ స్క్రీన్.
- 56 అంగుళాల భారీ హెచ్‌యూడీ.
- రోటేటింగ్ డ్యాష్ బోర్డు.
- అదనపు స్క్రీన్లుగా షియామీ ట్యాబ్లెట్లను కనెక్ట్ చేసుకునే సౌకర్యం. ఇలా కారులో మొత్తం 5–స్క్రీన్స్‌ను అనుసంధానం చేసుకోగలం.

## మ్యూచువల్ ఫండ్స్ భళా

### జూన్‌లో రికార్డు స్థాయి పెట్టుబడులు




### ఈక్విటీ ఎంఎఫ్‌ల్లోకి రూ.40 వేల కోట్లు

### సిప్‌లలోకి రూ.21 వేల కోట్లు రాక

ముంబై, జూలై 9: దేశీయ స్టాక్ మార్కెట్ల ఆల్‌టైమ్ హై పరుగుల నడుమ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్)ల్లోకి గత నెల రికార్డు స్థాయిలో పెట్టుబడులు వచ్చాయి. ఈ ఏడాది మే నెలతో పోల్చితే 17 శాతం పెరిగాయి మరి. మంగళవారం దేశీయ మ్యూచువల్ ఫండ్స్ ఇండస్ట్రీ సంఘం యాంఫీ వెల్లడించిన వివరాల ప్రకారం ఈ జూన్‌లో రూ.40,608 కోట్ల పెట్టుబడులు ఈక్విటీ ఎంఎఫ్‌ల్లోకి రావడం జరిగింది. ఇందులో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్‌లు)లోకి వచ్చినవి రూ.21,262 కోట్లుగా ఉన్నాయి. ఇదీ రికార్డే. మే నెలలో ఇవి రూ.20,904 కోట్లుగా నమోదయ్యాయి. అయితే ఏప్రిల్, మే నెలల్లో పోయిన పెట్టుబడుల కంటే వచ్చిన పెట్టుబడులే ఎక్కువంటున్న ఇండస్ట్రీ వర్గాలు.. జూన్‌లో మాత్రం వచ్చినదానికన్నా పోయినవే అధికమని, రూ.43,637 కోట్ల పెట్టుబడులు తరలిపోయాయని చెప్తున్నాయి.

**కొత్తగా 55 లక్షల సిప్‌లు**

ఈక్విటీ పథకాలపై మొత్తం ఎంఎఫ్ ఇండస్ట్రీ నిర్వహణలో ఉన్న నికర ఆస్తులు రూ.27.67 లక్షల కోట్లు. సిప్‌లకు సంబంధించి రూ.12.43 లక్షల కోట్లుగా ఉన్నాయి. గత నెల కొత్తగా 55 లక్షల సిప్‌లు నమోదయ్యాయి. దీంతో మొత్తం సంఖ్య 8.98 కోట్లకు చేరింది. 32.35 లక్షల సిప్‌లు మెచ్యూర్ లేదా మూతబడ్డాయని యాంఫీ సీఈవో వెంకట్ చలసాని తెలిపారు. ఇక మొత్తం మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీ నిర్వహణలోని ఆస్తులు జూన్ నాటికి రూ.61.15 లక్షల కోట్లపైనే. మే నెలాఖరుతో చూస్తే దాదాపు 4 శాతం అధికం.

**రుణ పథకాల్లో..**

అడ్వాన్స్ ట్యాక్స్ రిడెంప్షన్స్ కారణంగా రుణ పథకాల నుంచి జూన్‌లో రూ.1.07 లక్షల కోట్ల పెట్టుబడుల ఉపసంహరణ జరిగిందని యాంఫీ సీఈవో వెంకట్ తెలిపారు. దీంతో జూన్ 30 నాటికి డెట్ స్కీముల నిర్వహణలోని ఆస్తులు రూ.14.13 లక్షల కోట్లకు పడిపోయాయని చెప్పారు. ఇక లార్జ్ క్యాప్ స్కీముల్లో పెట్టుబడుల రాక రూ.970 కోట్లకు చేరింది. అయితే వాల్యుయేషన్స్ గురించి ఆందోళనలున్నా.. స్మాల్‌క్యాప్ స్కీముల్లోకి రూ.2,263 కోట్లు, మిడ్‌క్యాప్ స్కీముల్లోకి రూ.2,527 కోట్లు రావడం గమనార్హం. ఇతర స్కీముల విషయానికొస్తే.. హైబ్రిడ్ సెగ్మెంట్‌లోకి రూ.8,854 కోట్లు రాగా.. ఓవరాల్‌గా వీటి నిర్వహణలోని ఆస్తులు రూ.8.09 లక్షల కోట్లకు చేరాయి. ప్యాసివ్ స్కీముల నిర్వహణలోని ఆస్తులు రూ.10 లక్షల కోట్ల మార్కును దాటినట్టు వెంకట్ వెల్లడించారు. బంగారం ధరల పెరుగుదల నేపథ్యంలో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ (ఈటీఎఫ్) హోల్డింగ్స్ కలిసొచ్చాయన్నారు.

## రికార్డుస్థాయికి సూచీలు

### సెన్సెక్స్ 391, నిఫ్టీ 113 పాయింట్ల లాభం

ముంబై, జూలై 9: దేశీయ స్టాక్ మార్కెట్లు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. వాహన, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లతోపాటు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులు కుమ్మరించడంతో మరో ఉన్నత శిఖరానికి చేరుకున్నాయి. ఒక దశలో 400 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 391.26 పాయింట్లు ఎగబాకి 80,351.64 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ సైతం 112.65 పాయింట్లు అందుకొని రికార్డు స్థాయి 24,443.20 వద్ద స్థిరపడింది.

- మారుతి షేరు రికార్డు 6.60 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది.
- మహీంద్రా, ఐటీసీ, సన్‌ఫార్మా, టైటాన్, టాటా మోటర్స్, ఐసీఐసీఐ బ్యాంక్, నెస్లే, ఎల్‌అండ్‌టీ, బజాజ్ ఫిన్‌సర్వ్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎస్బీఐ, పవర్‌గ్రిడ్, టీసీఎస్, ఏషియన్ పెయింట్స్, అదానీ పోర్ట్స్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- రిలయన్స్, బజాజ్ ఫైనాన్స్, జేఎస్ డబ్ల్యూ స్టీల్, టాటా స్టీల్, ఇన్ఫోసిస్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, కొటక్ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు నష్టపోయాయి.
- దీంతో బీఎస్ఈలో లిస్టైన సంస్థల విలువ 451.27 లక్షల కోట్లకు చేరుకున్నది.
- విజయ డయాగ్నొస్టిక్స్‌లో ఏఐ మేవార్ కమర్షియల్ 2.2 శాతం వాటాను రూ.177 కోట్లకు విక్రయించింది.

## ఇంటింటా ఇన్నోవేటర్‌కు దరఖాస్తులు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఔత్సాహికులను వెలుగులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ 'ఇంటింటా ఇన్నోవేటర్–2024' కార్యక్రమానికి శ్రీకారంచుట్టింది. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర చీఫ్ ఇన్నోవేషన్ అధికారి అజిత్ రంగ్నేకర్ ఒక ప్రకటనలో సూచించారు. ప్రతియేటా నిర్వహించే ఈ కార్యక్రమం 6వ విడతను నిర్వహించేందుకు టీఎస్ఐసీ ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నదని, 33 జిల్లాల్లో 3 వేలకు పైగా గ్రామాల్లో ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ స్థాయి ఆవిష్కరణలను గుర్తించడంతోపాటు వాటిని ప్రాజెక్టులుగా రూపొందించేలా ప్రోత్సహిస్తామన్నారు. తమ ఆవిష్కరణలను ఆగస్టు 3లోగా 9109678543కి వాట్సప్ చేయాలని ఆయన సూచించారు.

## కిమ్స్ చేతికి క్యూఎన్ఆర్ఐ ఆసుపత్రి

హైదరాబాద్, జూలై 9: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఆసుపత్రుల నిర్వహణ సంస్థ కిమ్స్ హాస్పిటల్స్ మరో ఆసుపత్రిని కొనుగోలు చేసింది. తాజాగా వైజాగ్ కేంద్రస్థానంగా కార్యకలాపాలు అందిస్తున్న క్యూఎన్ఆర్ఐ హాస్పిటల్‌ని హస్తగతం చేసుకున్నది. పూర్తిగా నగదు రూపంలో జరగనున్న ఈ ఒప్పందం విలువ రూ.75 కోట్ల వరకు ఉంటుందని అంచనా. క్యూఎన్ఆర్ఐకి వైజాగ్ మధ్యలో 200 పడక గదుల సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రిని నిర్వహిస్తున్నది. 1.50 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో ఏర్పాటైన ఈ ఆసుపత్రితో 500 మంది వరకు ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరానికి క్యూఎన్ఆర్ రూ.62 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఈ ఒప్పందం వచ్చే నెల రోజుల్లో పూర్తికానున్నట్లు తెలుస్తున్నది.